# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 13 ఏప్రిల్ 2026




# డబుల్ బెడ్ రూమ్ సముదాయాల్లో షాపుల వేలం అమ్మకాలను ఆపాలి

### లేదంటే నివాసితులతో కలిసి అడ్డుకుంటాం : సిపిఎం



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 12 (నినాదం) :** డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాల్లో ఉన్న షాపుల వేలం అమ్మకాలను ఆపాలని దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో అన్ని బ్లాకులలో నివాసితులతో కలిసి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం దుండిగల్ గండిమైసమ్మ మండల కార్యదర్శి బొడిగె లింగస్వామి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కీలుకాని లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో నిర్మించిన 16 డబుల్ బెడ్ రూమ్ కాలనీలలో 992 వాణిజ్య సముదాయాలను వేలం పద్ధతిలో విక్రయించడానికి ఈ నెల 15వ తారీకు నుండి 17వ తారీకు వరకు కీసర మల్కాజ్గిరి ఆర్డిఓ కార్యాలయాల్లో బహిరంగ వేలం నిర్వహించుటకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే జరిగితే డబుల్ బెడ్ రూమ్ కాలనీ ల్లో నివాసం ఉంటున్న ప్రజలపై భారం పడుతుం దని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయో జనాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, ఇప్పటికే కనీస వసతులు, సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతుంటే సమస్యలు పరిష్కరించకపోగా ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూర్చుకో వడానికి షాపుల వేలం పేరుతో అమ్మడానికి పూనుకుందని పేర్కొన్నారు. ఈ అమ్మకాలను డబుల్ బెడ్ రూమ్ వాసులు పూర్తిగా వ్యతిరేకిస్తున్న ప్రభుత్వం మాత్రం వేలం అమ్మకాలకు సిద్ధపడిందన్నారు. ఈ వేలం పాటలను వ్యతిరేకిస్తూ ఆర్డీవో కార్యాలయాల్లో జరిగే బహిరంగ వేలాన్ని అడ్డుకోవాలని, లేనిపక్షంలో డబుల్ బెడ్ రూమ్ కాలనీలలో నివసించే ప్రజలపై భారం పడుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి బహిరంగ వేలాన్ని ఆపి డబుల్ బెడ్ రూమ్ కాలనీ అసోసియేషన్లకు షాపులు అప్ప చెప్పాలని సూచించారు. అసంపూర్ణంగా ఉన్న పనుల మరమ్మత్తులకు, డబుల్ బెడ్ రూమ్ కాలనీలా అభివృద్ధి కి బడ్జెట్లో నిధులు కేటాయించి ప్రజలపై భారాన్ని నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు. పసుల అంజయ్య, వీరమల్లు, జగదీష్, బ్లాక్ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్ళు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఫలితాలలో "వెక్టార్" విద్యార్థుల ప్రభంజనం



**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 12 (నినాదం) :** నిజామాబాద్ నగరంలోని వెక్టార్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతి సంవత్సరంలాగానే ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించి విజయఢంకా మోగించారు. . ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మధు సూధన్ జోషి డైరెక్టర్ సంఘం సంతోష్, గజానన్, కార్తీక్విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా మధు సూధన్ జోషీ మాట్లాడుతూ...ఆదివారంప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో వెక్టార్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంపీసీ ఫలితాల్లో జొర్రీగలసాత్విక్ 468/470 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాంధించగా, బుట్టు హేమశ్రీ 467/470 మార్కులు,జి.వీణ, సూర్యవంశి 466/470 మార్కులు , భానుశ్రీ, మణిరాజ్, రక్షిత, శర్వాణి ఈనలుగురు 465/470 మార్కులు సాధించారు. కళాశాలకు చెందిన 43 మంది విద్యార్థులు 460 కిపైగా మార్కులు సాధించారు .బైపిసి మొదటి సంవత్సరంలో బండి శరత్ చంద్రిక 437/440మార్కులలతో రాష్ట్ర స్థాయి ఫలితాలు సాధించారు . సీనియర్ ఇంటర్ ఎంపిసీలో ఎస్. మనస్విని 991/1000 మార్కులతోరాష్ట్ర స్థాయి-ర్యాంకు సాధించగా 989/1000మార్కులతో జి. శ్రీనిధి 988/1000 మార్కులను వంశి, యశ్వంత్,సుమిత్ కుమార్, మోర శ్రీవాస్తవ ప్రతిభ కనబరి చారని కళాశాల చైర్మన్ మధుసూదన్ జోషి తెలిపారు.

## యూనిక్ బాధితుల ఆందోళనకు ఊపుమిచ్చిన సమావేశం

### డబ్బులు తిరిగి వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందన్న నాయకులు

### ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి



**కరీంనగర్, ఏప్రిల్ 12(నినాదం) :** టీఎన్‌జీవోస్ కార్యాలయ భవనంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఆధ్వర్యంలో యూనిక్ బాధితుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బాధితులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను వివరించారు.ఉద్యమ నాయకురాలు పూజిత మాట్లాడుతూ, బాధితులపై జరుగుతున్న అన్యాయాన్ని ఖండించారు. వారి డబ్బులు వెంటనే తిరిగి చెల్లించాలని, మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.సీనియర్ నాయకుడు అంబటి జోజి రెడ్డి ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించారు. బాధితులను తప్పుదోవ పట్టించే వారిపై కేసులు నమోదు చేస్తామని, పోలీసులతో మాట్లాడి భద్రత కల్పిస్తామని తెలిపారు. మోసగాళ్లపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇతర నాయకులు కూడా బాధితులకు అండగా నిలుస్తామని తెలిపారు. అవసరమైతే న్యాయపరమైన పోరాటం చేస్తామని న్యాయవాది రామారావు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే సమస్యను పరిష్కరించాలని నేతలు కోరారు.ఈ సమావేశం ముగింపులో, న్యాయం సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయించారు.

## మహా ధర్నాను విజయవంతం చేయండి

### సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు



**అమరచింత, ఏప్రిల్ 12, (నినాదం):** అమెరికా భారత్ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నేడు హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేపట్టనున్నట్లు ఏఐకేఎస్ నాయకులు కే రాజన్న తెలిపారు. ఆదివారం ఆయన అమరచింత మండలంలోని నందిమల్ల కిష్టంపల్లి గ్రామాలలో మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఏఐయుకేఎస్ నాయకుల సమక్షంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెట్ విధానాలు విద్యుత్ బిల్లుల ద్వారా రైతులను మరింత కష్టాల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. పత్తి రైతులకు కనీసం మద్దతు ధర పడిపోయి కష్టాల్లోకి కూరుకుపోయారని అన్నారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయాన్ని కార్పొరేట్ చేతిలోకి అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మన భారతదేశం అతి పెద్ద వ్యవసాయ ఆధారిత దేశంగా ఉందని 86% చిన్నకారు రైతులే ఇందులో ఉన్నారని ఇప్పటికి మన దేశంలో వ్యవసాయంపై 14 కోట్ల కుటుంబాలు ఆధారపడ్డాయని వీరి జీవన విధానంపై కేంద్ర ప్రభుత్వం దెబ్బ కొడుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చర్యల వల్ల ఆహారభద్రకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ రైతాంగ హక్కుల కోసం పోరాట పోరాట పంతాన్ని ఎంచుకుందని ఈ మేరకే నేడు ఇందిరాపార్కు వద్ద మహాధర్మ చేపడుతున్నామని ఈ ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు

### కాంగ్రెస్ పాల్వంచ టౌన్ అధ్యక్షుడు నూకల రంగారావు, 5వ డివిజన్ కార్పొరేటర్ నూకల సరిత



**కొత్తగూడెం, ఏప్రిల్ 12(నినాదం) :** రాష్ట్రంలో ప్రకటించిన ఇంటర్మీ డియట్ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులందరికి కాంగ్రెస్ పాల్వంచ టౌన్ అధ్యక్షుడు నూకల రంగారావు, 5వ డివిజన్ కార్పొరేటర్ నూకల సరిత, హృదయపూర్వక శు భాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల కృషి ప్రశంసనీయం అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు మరింత ప్రకాశవంతంగా ఉండాలని ఆకాంక్షించారు. తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు నిరుత్సా హపడవద్దని, ఇంటర్ అనేది జీవితంలో ఒక దశ మాత్రమేనని, పరీక్షలు జీవితానికి ముగింపు కావని తెలిపారు. ధైర్యంగా ముందుకు సాగి ఉన్నత విద్యలో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేస్తే భవిష్యత్తు బంగారు భవితగా మారుతుందని వారు ఆకాంక్షించారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంకులతో జిల్లా ఖ్యాతి దశదిశలా వ్యాప్తి

### కార్పొరేట'కు దీటుగా జిల్లా విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

### ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల పట్టుదల అభినందనీయం

### కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**కొత్తగూడెం, ఏప్రిల్12 (నినాదం) :** రాష్ట్ర స్థాయి ర్యాంకులతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చెందిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కొనియాడారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెరుగైన ఫలితాలు సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా జిల్లా విద్యార్థులు చూపిన ప్రతిభ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయడం గర్వకారణమన్నారు. ఏజెన్సీ జిల్లా అయినప్పటికీ, ఇక్కడి విద్యార్థులు పట్టుదలతో చదివి అద్భుతమైన మార్కులు సాధించడం శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలకు, అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయం జిల్లా విద్యా రంగంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

## లెంకలపల్లిలో విద్యుత్ సమస్యలకు చెక్

### కొత్త ట్రాన్స్ఫార్మర్ ప్రారంభంతో రైతులకు ఊరట

### ఎన్పీడీసీఎల్ ఏఈ చొరవ ఫలితం



**నల్లబెల్లి, ఏప్రిల్ 12(నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లెంకలపల్లి గ్రామంలో ఎన్నాళ్లుగానో కొనసాగుతున్న తక్కువ వోల్టేజ్, విద్యుత్ అంతరాయాల సమస్యలకు చెక్ పడింది. నల్లాల మోటార్లకు సరైన విద్యుత్ సరఫరా అందించేందుకు కొత్త ట్రాన్స్ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు నల్లబెల్లి ఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏ ఈ) చొరవతో సాధ్యమైంది. గ్రామ సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి రవీందర్ , ఉప సర్పంచ్ కొలిపాక రఘుపతి ఈ ట్రాన్స్ఫార్మర్‌ను ప్రారం భించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు నల్లాల మోటార్లు సరిగా పని చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తక్కువ వోల్టేజ్ కారణంగా మోటార్లు కాలిపో వడం, నీటి సరఫరా లోపించడం వంటి సమస్యలు తరచూ ఎదురయ్యేవి. కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు ద్వారా ఇప్పుడు మోటార్లు సక్రమంగా పనిచేసి పంటల సాగుకు అవసరమైన నీటి సరఫరా సులభంగా అందనుంది. గ్రామ రైతులు మాట్లాడుతూ, ఈ ట్రాన్స్ఫార్మర్ వల్ల విద్యుత్ సరఫరా స్థిరపడటంతో పాటు పంట దిగుబడులు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది గ్రామ వ్యవసాయాభివృద్ధికి కీలకంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎద్దు రాజయ్య, కొత్తపెల్లి రమేష్, ఎద్దు శీను, నూటెంకి సాంబయ్యతో గ్రామ పెద్దలు, రైతులు, యువకులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి అధికారులు తీసుకుంటున్న చర్యలను అభినందించారు.

## అనారోగ్యంతో బాధపడుతూ యువతి ఆత్మహత్య



**జమ్మికుంట, ఏప్రిల్ 12 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కృష్ణకాలనికి చెందిన చిట్యాల ప్రణతి(24) అనే యువతి ఆరోగ్య సమస్యలు తట్టుకోలేక ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి విజయ తెలిపిన వివరాల ప్రకారం గత మూడు సంవత్సరాల నుండి తన కూతురు ప్రణతి ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేదని డాక్టర్లకు చూపెట్టిన ఆరోగ్యం బాగుపడలేదని తెలిపింది. ఆదివారం కుటుంబ సభ్యులు వారి పనుల నిమిత్తం బయటికి వెళ్ళగా ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బాధితురాలు తల్లి తెలిపింది. తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ తెలిపారు.

## నిర్మల్‌లో "జె సిఐ నిర్మల్ స్ఫూర్తి" ఆవిర్భవం

### యువతకు నాయకత్వ దిశగా సరికొత్త వేదిక






**నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్ 12. (నినాదం):** యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, వ్యక్తిత్వ వికాసానికి మార్గం సుగమం చేసే అంతర్జాతీయ సంస్థ జేసీఐ (Junior Chamber International) నిర్మల్ పట్టణంలో తన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. పట్టణంలోని హోటల్ మారుతి ఇన్‌లో "జెసిఐ నిర్మల్ స్ఫూర్తి" పేరిట ఏర్పడిన ఈ కొత్త చాప్టర్ ఇనాగురేషన్ మరియు ఇన్స్టాలేషన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. నిర్మల్ జిల్లా యువతకు ఒక శక్తివంతమైన వేదికగా నిలుస్తుందనే నమ్మకంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. యువతలో ప్రతిభను వెలికితీయాలి: డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి ఈ వేడుకకు ముఖ్య అతిథిగా మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి గారు హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను వెలికితీయడా నికి జెసిఐ వంటి వేదికలు అత్యంత అవసర మని పేర్కొన్నారు. నాయకత్వం అంటే కేవలం పదవి కాదని, అది సమాజాన్ని మార్చే ఒక గొప్ప బాధ్యత అని ఆయన యువతకు ప్రేరణాత్మకంగా వివరించారు.


**నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం:** కార్యక్రమంలో భాగంగా జెసి వాడేకర్ లక్ష్మణ్ గారు జెసిఐ నిర్మల్ స్ఫూర్తి ఫౌండర్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు సెక్రటరీగా జెసి డి. విశ్వశ్రీ, ట్రెజరర్‌గా జెసి అనిల్ దూగ్గే, జూనియర్ జెసి చైర్మన్‌గా జూనియర్ జెసి ప్రీతం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యవర్గ సభ్యులుగా జెసి డా. అల్లిడి సురేష్, జెసి గంధం సాయినాథ్, రమేష్, వెంకట్ రాకొండే, సాయి కిరణ్, గౌతం, రాజేష్, శ్రీలత తదితరులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ గారు మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో యువతకు మార్గదర్శకుడిగా నిలబడి, సేవా మరియు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తానని తెలిపారు.

**నాయకత్వ శిక్షణ మరియు మార్గదర్శనం:** జెసిఐ జోన్-12 అధ్యక్షులు జేఎఫ్ఎస్ గౌతమ్ కుమార్ జైన్ గారు, వైస్ ప్రెసిడెంట్ జేఎఫ్ఎం గుండం మహేందర్ గారు హాజరై సభ్యులకు మార్గదర్శనం అందించారు. నేషనల్ ట్రైనర్ జేఎఫ్ఎం సాయి కిరణ్ బంటు నాయకత్వ నైపుణ్యాలు మరియు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సభ్యులకు లోతైన అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెసిఐ హైదరాబాద్ స్ఫూర్తి అధ్యక్షులు సాయికుమార్ దిగవత్, సెక్రటరీ సిమ్రాన్ ఫరీక సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాబోయే రోజుల్లో రక్తదాన శిబిరాలు, కెరీర్ మార్గదర్శనం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

## అధికారుల నిర్లక్ష్యం సామాన్యుడికి శాపం







### బోరిగాంలో తాగునీటి కోసం తండ్లాట!

**నిర్మల్ ప్రతినిధి,లక్ష్మణచాంద:ఏప్రిల్ 12 (నినాదం):** జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంటే, క్షేత్రస్థాయిలో సామాన్యుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయి. లక్ష్మణచాంద మండలం బోరిగాం గ్రామంలో తాగునీటి సమస్య జటిలమవుతున్నా, బాధ్యత గల అధికారులు మొద్దునిద్ర వీడటం లేదని గ్రామస్తులు నిప్పులు చెరుగుతున్నారు. ప్రభుత్వ ఆస్తులను కొందరు వ్యక్తులు తమ సొంతానికి వాడుకుంటూ ప్రజల గొంతు ఎండుతున్నా పట్టించుకోకపోవడం అధికారుల అసమర్థతకు అద్దం పడుతోంది.

**అక్రమార్కుల ఆగడాలు - అధికారుల మౌనం**

గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాల్సిన ప్రభుత్వ చేతిపంపులను కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా తొలగించి, విద్యుత్ మోటార్లను బిగించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, పంచాయతీ రాజ్ చట్టం 2018ని తుంగలో తొక్కి రోడ్డుపై పైపులు వేసి నీటిని దారి మళ్లిస్తున్నా అటు పంచాయతీ కార్యదర్శి గానీ, ఇటు ఎంపీఓ గానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వివరించడం అక్రమార్కులకు వరంగా మారింది.

**డీపీఓ కార్యాలయం చుట్టూ తిరిగినా శూన్యం**

సమస్యను జిల్లా పంచాయతీ అధికారి (ఇూా) దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. మార్చి 23వ తేదీనే గోలగాని లక్ష్మి అనే బాధితురాలు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా, నేటికీ క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. జిల్లా అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితమవుతున్నారా అని ప్రజలు మండిపడుతున్నారు.

**జిల్లా అధికారులు ఉన్నారా? లేరా?**

తాగునీటి వంటి కనీస అవసరాల కోసం ప్రజలు వీధికెక్కి పోరాడాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరం. గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రమవుతున్న వేళ, వ్యక్తిగత కక్షలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నా అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, బోరిగాంలో అక్రమంగా బిగించిన మోటార్లను తొలగించి, ప్రజలకు తాగునీరు అందేలా చూడాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు తమ పద్ధతి మార్చుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.